క్లుప్తంగా

భూ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయండి

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వ, ఇనాం, దేవదాయ శాఖల భూములతోపాటు ఇతర భూముల వివరాలను పక్కగా ఆన్‌లైనలో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూముల ఆన్‌లైన్‌పై డివిజన్, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పంటలు పండించే రైతుల వివరాలను వ్యవసాయ శాఖ తహసీల్దార్ల ద్వారా తెప్పించుకొని వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆ వివరాలతో వెంటనే వ్యవసాయశాఖ ఈకేవైసీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీపీఓ నాగరాజునాయుడు, సర్వే ఏడీ విజయసారథి పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల తనిఖీ

కర్నూలు (న్యూసిటీ): స్థానిక బళ్లారి చౌరస్తా ప్రాంతంలోని రైస్ మిల్లులను తూనికలు, కొలతల శాఖ జిల్లా కంట్రోలర్ శ్రీరాముడు తనిఖీ చేశారు. బియ్యం ప్యాకెట్లలో తూకం తక్కువ వస్తుందనే సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టారు. మొత్తం నాలుగు రైస్‌మిల్లులను తనిఖీ చేయగా అందులో సంగమేశ్వర, మారుతి రైస్‌మిల్లుల్లో 25 కేజీల బస్తాల్లో కేజీ చొప్పున బియ్యం తక్కువగా వచ్చింది. దీంతో ఆ రెండు మిల్లులపై కేసు నమోదు చేసి రూ. 45 వేలు జరిమానా విధించినట్లు డీసీ తెలిపారు. ఎవరైనా తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని బియ్యం వ్యాపారులకు హెచ్చరించారు.

విధుల్లో చేరిన ప్రొఫెసర్లు

కర్నూలు (న్యూసిటీ): 2015-16లో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను జీఓ నంబర్ 30 ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేశారు. అయితే, ఈపోస్టుల భర్తీలో యూజీసీ నిబంధనలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మహిళ రిజర్వేషన్ పాటించలేదని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం నాడు భర్తీ చేసిన పోస్టులను రద్దు చేసింది. దీనిపై బాధిత ప్రొఫెసర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యాముల రావు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో తొలగించిన ప్రొఫెసర్లను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ఉపకులపతులకు లేఖ రాశారు. దీంతో రాయలసీమ యూనివర్సిటీలోని ముగ్గురు ప్రొఫెసర్లు సుందరానంద పుచ్ఛ, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్‌ను తిరి విధుల్లో చేర్చుకున్నామని రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి

కర్నూలు (టౌన్) : నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి సర్వీస్ రోడ్డును క్రమ బద్ధీకరించాలన్నారు. నగరంలో సిటీ బస్సులను ఆవశ్యకతపై చర్చిస్తామన్నారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, రహదారులు భవనాల శాఖ ఎస్‌ఈ నాగరాజు, నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీలు హయ్యత్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పడిదెంపాడు, పూడూరు రోడ్లు వేయాలి

కర్నూలు(సెంట్రల్): మండలంలోని పడిదెంపాడు, పూడూరు గ్రామలకు రోడ్లు వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి డిమాండ్ చేశారు. ఈ అంశంపై శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో కోడుమూరు బీజేపీ ఇన్‌చార్జి మీసాల ప్రేమ్ కుమార్ చేపట్టిన రెండురోజుల దీక్షలు శుక్రవారం ముగిశాయి. ముగింపు రోజు బీజేపీ జిల్లా అధ్యక్షుడు హాజరై ప్రసంగించారు. అనంతరం రహదారుల సమస్యపై కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ నాయకులు అంకాలరెడ్డి కాళింగి నరసింహ వర్మ, మధుకిషోర్ పాల్గొన్నారు.

నేత్రదానంపై మూఢనమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న డాక్టర్ పి.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలను వీడాలని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు కోరారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అపోహలు, మూఢనమ్మకాల కారణంగా చాలా మంది నేత్రదానం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. మొత్తం కన్ను గాకుండా నల్లగుడ్డు(కార్నియా) మాత్రమే తీస్తారని, దాని స్థానంలో కృత్రిమ కళ్లను అమర్చడం వల్ల వారికి ఎలాంటి అవయవలోపం కనిపించదన్నారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని ఆరు గంటల్లోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రంకు సమాచారం ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి. భరత్ పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవి ఆలయంలో అలంకరణలో అమ్మవారు



అభయాంజనేయ స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



సూర్యనారాయణ స్వామి ఆలయంలో కలశ పూజ



ఇ. తాండ్రపాడు నీలకంఠ స్వామి ఆలయంలో..

దీవించమ్మా.. సౌభాగ్య లక్ష్మి

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన ఆలయాలు, అమ్మవారి ఆలయాల్లో పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కథలను వివరించారు. వేలాది మంది ముత్తయిదువులు వారివారి సమీప ఆలయాలకు వెళ్లి అమ్మవారి సమక్షంలో వ్రతాలు ఆచరించారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలోని చౌడేశ్వరీ దేవి ఆలయం, పాతనగరంలోని చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి, కాళికాంబ దేవి, లలితా సుందరేశ్వర, అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయాలు, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలు, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వ్రతాలు ఆచరించారు. వీహెచ్‌పీ మాతృశక్తి ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

జిల్లా రచయితకు 'హంస' పురస్కారం



అజీజ్

కర్నూలు కల్చరల్: జిల్లా రచయిత ఎస్‌డీవీ అజీజ్ హంస పురస్కారం-2023కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరుస్తూ సేవలు అందించిన 11 మందికి ఈ పురస్కారాలు ప్రకటించింది. సాహిత్య విభాగం నుంచి ఎస్‌డీవీ అజీజ్‌ను ఎంపిక చేశారు. ఈయన కర్నూలు నగరం బుధవారపేటకు చెందిన వారు. దాదాపు 40 సంవత్సరాలుగా సాహిత్య రచన, చారిత్రక పరిశోధన చేస్తున్నారు. స్టేజి నాటకాలు, రేడియో నాటకాలు, చారిత్రక నవలలు, పరిశోధన గ్రంథాలు వెలువరించారు. ఇప్పటికే ఈయన కందుకూరి పురస్కారం, తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం, హీరాలాల్ స్మారక సాహితీ పురస్కారం, లలితా కళా సమితి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తాజాగా హంస పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 29న విజయవాడలో జరిగే తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో ఆ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను పలు సాహితీ సంస్థల నిర్వాహకులు, సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు



ట్రాన్స్‌జెండర్లతో సమావేశమైన అధికారులు

కర్నూలు (హాస్పిటల్) : జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేస్తామని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. వీహెచ్‌ఎస్ సీడీసీ ప్రాజెక్టు ఆస్పైర్ వన్ స్టాప్ సెంటర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక హోటల్‌లో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ పరీక్షలు చేసేందుకు వన్‌స్టాప్ సెంటర్ ద్వారా ఏర్పాట్లు చేస్తామన్నారు. లయన్స్ క్లబ్, పాజిటివ్ నెట్‌వర్క్ ద్వారా ట్రాన్స్‌జెండర్, హెచ్‌ఐవీ వారికి ఆరు నెలల పాటు పోషకాహారం అందజేస్తామన్నారు. దిశ పోలీస్ శాఖ ద్వారా స్వాభిమాన్ 1091 టీజీ హెల్ప్‌లైన్ నెంబర్ ద్వారా, ప్రొటెక్షన్ సెల్ పైన ట్రాన్స్‌జెండర్లందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే బస్సుల్లో ప్రయాణించే టప్పుడు వారికి తగిన సీట్లు కేటాయించేందుకు, బహిరంగ ప్రదేశాల్లో వారికి టాయిలెట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీపీఎంఎస్‌ఓ డాక్టర్ ఉమ, జీజీహెచ్ వీడీఎల్ హెచ్‌ఓడీ డాక్టర్ పెంచలయ్య, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా మేనేజర్ అలీ హైదర్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ ఫాతిమా, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, దిశా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ ఇర్ఫాన్ బాషా, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, వన్‌స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ స్వర్ణలత, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ సుధారాణి, వీహెచ్‌ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం కావాలి



వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జిల్లా కమిటీలో చోటు పొందిన నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): వచ్చే ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. పార్టీ జిల్లా కమిటీలో చోటు పొందిన నాయకులతో ఆయన శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ సర్కిల్‌లోని మహానేత డాక్టర్ వైఎస్‌ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తప్పకుండా భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుతం పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తగా నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకల్లు ప్రసాద్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు కె.చెన్నమ్మ, షేక్ షౌకత్ అలీ, శివ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, లక్ష్మన్న, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాయిబాబా నగర్ వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్దార్, మహేష్, రమణ, ఇబ్రు, మునిస్వామి, సుబ్బు, చిన్ని, సిద్ధయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో రంగం రాష్ట్ర ప్రథమ మహాసభలు



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, తదితరులు

కర్నూలు కల్చరల్: రంగం రాష్ట్ర ప్రథమ మహాసభలను సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రంగం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కరుణాకర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టర్ బంగ్లాలో విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రవీంద్ర విద్యాసంస్థల పుల్లయ్య మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ బాబు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి రంగం ప్రజా సాంస్కృతిక వేదిక తెలుగు భాషా సంస్కృతులను కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత కోసం పోరాడుతున్నారు. రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలో ఉన్నటువంటి ఉమ్మడి 13 జిల్లాల నుంచి ప్రతినిధులతో ప్రథమ మహాసభలు రాయలసీమ ముఖ ద్వారం కర్నూలు జిల్లాలో జరపనున్నట్లు వెల్లడించారు. సభ్యులు డాక్టర్ అమరేంద్రరెడ్డి, రాజేంద్రప్రసాద్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోండి



సుంకేసుల రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(టౌన్): నగర ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఇరిగేషన్, నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనర్ వారితో కలిసి సుంకేసుల బ్యారేజీని పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డ్యామ్‌లో నీటి నిల్వల గురించి ఆరా తీశారు. 0.7 టీఎంసీ నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. అలాగే కర్నూలు నగరానికి వదిలే నీరు మధ్యలో చౌర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సుంకేసుల బ్యారేజీని పరిశీలించిన అనంతరం కమిషనర్ నగరపాలక కార్యాలయంలో ఇరిగేషన్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరా అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ తిరుమలేశ్వర రెడ్డి, డీఈ రఘురామిరెడ్డి, నగరపాలక డీఈఈ రవిప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కాలేజీల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి జేఎన్‌టీయూ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య బి.ఈశ్వర్‌రెడ్డి, మైపర్ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ హాజరై ప్రసంగించారు. కాలేజీలో ప్రోగ్రాం నిర్వహించేందుకు అనుమతించిన మైపర్ కాలేజీ యాజమాన్యానికి ఈశ్వర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జేఎన్‌టీయూకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు ఇదే రీతిలో సహకారం అందించాలని కోరారు. అనంతరం ట్రిపుల్‌ఐటీ డీఎం అసోసియేట్ ఆచార్యులు డా.జె కృష్ణయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సిబ్బంది బోధన తీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల పితామహుడు బీపీ మండల్



బీపీ మండల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అమలు చేసిన మహోన్నత వ్యక్తి బిందేశ్వరి ప్రసాద్‌మండల్ (బీపీ మండల్) అని బీసీ నేతలు కొనియాడారు. శుక్రవారం బిహార్ మాజీ ముఖ్యమంత్రి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. బీసీ జేఏసీ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు విద్య, ఉపాధి రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన గొప్ప దార్శనికులు బీపీ మండల్ అన్నారు. ఆయన కల్పించిన రిజర్వేషన్ల వల్లే ఓబీసీలు దేశంలో అత్యున్నత పదవులను పొందారన్నారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు అయ్యన్నయాదవ్, శ్రీరాములు యాదవ్, కురువ పుల్లన్న, ధన విజయుడు, చంద్రికమ్మ, మధు యాదవ్, శివశంకర్, మల్లయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

కబడ్డీ విజేతలు పెద్ద హరివాణం, అమకతాడు జట్లు

కర్నూలు (టౌన్) : జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో బాల, బాలికల విభాగాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దహరివాణం (బాలురు), అమకతాడు (బాలికలు) జట్లు విజేతలుగా నిలిచాయి. జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం ఫైనల్స్ జరిగాయి. ఇందులో బాలుర విభాగంలో పెద్ద హరివాణం జట్టు 19-12 పాయింట్ల తేడాతో గుండ్లకొండ జట్టుపై గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో అమకతాడు జట్టు 14-7 పాయింట్ల తేడాతో పల్లెపాడు జట్టుపై గెలిచింది. గెలుపొందిన జట్లను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సీఈఓ నాగరత్నమయ్య, చిట్టిబాబు, నాగరాజు, శేఖర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సహకారం అందిస్తా

కర్నూలు (టౌన్) : క్రీడలకు తన వంతు సహకారం అందిస్తానని జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హ్యాండ్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు మరింత సాధన చేసి రాణించాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు గంగాధర్, సుధీర్, షేక్షావలి, పోటీల కోఆర్డినేటర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 26, 27 తేదీల్లో ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించే 5 వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని కర్నూలు నియోజక వర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక టీజీ వెంకటేష్ స్వగృహంలో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా తరపున పాల్గొంటున్న క్రీడాకారులు మంచి ప్రదర్శనతో పతకాలు సాధించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ టీ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్. నరసింహులు, రైల్ మిల్లు హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు న్యూసిటీ హమాలీ కార్మికుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికుల చేత సంతకాల సేకరణ నిర్వహించారు.

మహిళా టీచర్‌కు ఫ్యాప్టో చేయూత

కర్నూలు సిటీ: నందికొట్కూరు పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా పని చేస్తున్న ఏ.నాగలక్ష్మి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో ఆమెకు ఫ్యాప్టో ఆర్థిక చేయూత అందించింది. శుక్రవారం కర్నూలు డీఈఓ డా.వి రంగారెడ్డి చేతుల మీదుగా ఆసంఘం నాయకులు ఈ సహాయాన్ని అందజేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిమ్మన్న, ప్రకాష్‌రావు, జి.హృదయ రాజు, జిల్లా చైర్మన్ గోకారి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 10.30 గంటలకు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న 42 వలంటీర్ పోస్టులకు 395 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

నాటకాలు సామాజిక చైతన్య దీపికలు

– ప్రారంభమైన సాంఘిక నాటకోత్సవాలు



వై.కె.నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని గోపిశెట్టి వెంకటేశ్వర్లుకు అందజేస్తున్న మేయర్ రామయ్య

కర్నూలు కల్చరల్: నాటకాలు సామాజిక చైతన్య దీపికలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. వై.కె. నాగేశ్వరరావు స్మారకార్థం వై.కె.నాగేశ్వరరావు స్మారక నాటకోత్సవాలు శుక్రవారం సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలను మేయర్ ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలోని ముఠా కక్షలపై పులిస్వారి నాటకాన్ని ఏ విధంగా ప్రదర్శించారో అదే విధంగా ప్రస్తుతం కర్నూలులో ఉన్న కాలుష్యంపై కళాకారులు ప్రజలను చైతన్య వంతం చేయాలన్నారు. జిల్లా కళారంగానికి నిలయమన్నారు. వై.కె.నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని కర్నూలుకు చెందిన నంది అవార్డు గ్రహీత గోపి శెట్టి వెంకటేశ్వర్లుకు అందజేశారు. అనంతరం గుడివాడ శ్రీకృష్ణా తెలుగు థియేటర్స్ వారి 'పారిజాతం', వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'నెట్' నాటకాలు చూపరులను అలరించాయి. కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహరావు, ముఖ్య సలహాదారులు డి. రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా పౌరాణిక నాటకాలకు, నటులకు నిలయమన్నారు. విశ్రాంత కలెక్టర్ బలరామయ్య మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకొచ్చే విధంగా నాటకాలు ఉండాలన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6.30 గంటలకు పొన్నూరు రసఝరి వారి 'త్రిజుడు' రాత్రి 8 గంటలకు కట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి 'ప్రక్షాళన' నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళావిపంచి ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు, సాహితీ వేత్త డాక్టర్ వి.పోతన తదితరులు పాల్గొన్నారు.

పవర్‌హౌస్‌లో పేలిన విద్యుత్ బ్రేకర్

కర్నూలు (రాజ్‌విహార్) : విద్యుత్ సంస్థ కర్నూలు పవర్‌హౌస్‌లోని సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ పేలిపోయింది. శుక్రవారం రాత్రి పిల్లి బ్రేకర్‌పై పడటంతో ఈ ఘటన జరిగింది. దీంతో సంస్థకు రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందని కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు. అయితే బ్రేకర్ పేలిపోవడంతో రాత్రి 8.20 నుంచి 9.30 గంటల వరకు నగరంలోని అనేక కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆపరేషన్స్ ఎస్‌ఈ ఉమాపతి, టౌన్ ఈఈ రమేష్, ఏడీఈ రాజామోహన్‌రెడ్డి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎస్‌ఈఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా బళ్లారీ రోడ్డు సెక్షన పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్, ప్రకాష్ రెడ్డి నగర్, లెప్రసీ కాలనీ, బోసిరెడ్డి కాలనీ, ఎలుకూరు బంగ్లా, వసుంధర అపార్ట్‌మెంట్స్ చుట్టూ ఉన్న ప్రాంతాలు, అలాగే 33 కేవీ నన్నూరు, ఓర్వకల్లు, నంది కొట్కూరు ఫీడర్లలో చేపట్టనున్న పనుల కారణంగా హౌసింగ్ బోర్డు కాలనీ, కమలా నగర్, అరోరా నగర్, బీ.క్యాంప్, కిసాన్ నగర్, టెలికాం నగర్, గఫ్ఫార్ నగర్, శ్రీ నగర్ కాలనీ, పార్థసారథి నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, డాక్టర్స్ కాలనీ, గణేష్ నగర్, శ్రీరామ్ నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, చెక్ పోస్టు ఏరియా, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, కల్లూరు సెక్షన్‌లోని అబ్బాస్ నగర్, కృష్ణ నగర్, రామకృష్ణ నగర్, రామచంద్ర నగర్, గుత్తి రోడ్డు పెట్రోల్ బంక్ ఏరియా, శరీన్ నగర్, శరీఫ్ నగర్, అలాగే ఓర్వకల్లు మండలంలోని బ్రాహ్మణపల్లి, భైరాపురం, సీసీ పల్లి, చింతలపల్లి, జీబీ తాండ, గుట్టపాడు, హుసేనాపురం, కాల్వ, కన్నమడకల, కేతవరం, కొమ్మరోలు, హెచ్. కొట్టాల, లొద్దిపల్లి, మీదివేముల, మంగళంపల్లి, ఎన్‌కె పాడు, నన్నూలు, ఓర్వకల్లు, పాలకొలను, పుడిచెర్ల, శకునాల, సోమయాజులపల్లె, తిప్పాయిపలిల, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు సహకరించాలని కోరారు.